

గోవిందా హరి గోవిందా!
గోకుల నందన గోవిందా



మల్దకల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజస్తంభం వద్ద పూజ చేస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు 7

పటిష్ట భద్రతలో ఈవీఎంలు

● కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఈవీఎంల గోదాంను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తిరాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల భద్రత వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కుమారస్వామి, పరమేశ్వరచారి, బాలరాజు, వేణాచారి, జమీల్ తదితరులు ఉన్నారు.

సర్దుబాటు ఎలా..?

- ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణకు సిబ్బంది నియామకంపై సర్కారు మల్లగుల్లాలు
- మండలానికి కనీసం ముగ్గురు సిబ్బంది ఉంటేనే సాధ్యమవుతుందని అధికారుల భావన
- అవుట్ సోర్సింగ్ నియామకాలపై దృష్టి

ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరుపేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని నాయకులు ఊదరగొట్టారు. రెండు దఫాలు గెలిచినప్పటికీ డబుల్ బెడ్రూం ఇళ్లు అర్హులకు ఇవ్వకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు పెంచుకొని అధికారం ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలకు తావులేకుండా బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే అంశంపై సందిగ్ధత నెలకొన్నది. గతంలో వైఎస్ హయాంలో రాష్ట్రంలో ప్రత్యేకంగా గృహ నిర్మాణ శాఖ ఉండేది. జిల్లా కేంద్రంలో ఎస్ఈ, డీఈ, ఏఈలతో పాటు ప్రత్యేక విభాగాన్ని కేటాయించారు. ఈ పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలంటే క్షేత్రస్థాయిలో పకడ్బందీ వ్యవస్థ ఉండాలని సంకల్పిస్తున్న ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రాథమిక నిర్ణయాలు తీసుకోకపోవడం గమనార్హం.

- నాగర్‌కర్నూల్, ఆంధ్రజ్యోతి

6



మెరుగైన బోధనకు కృషి

● జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వసతిగృహ విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నాం. అంతే కాకుండా మెరుగైన బోధన చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

జిల్లాలో ఎస్సీ వసతి గృహాలు ఎన్ని ఉన్నాయి..?

జిల్లాలో మొత్తం 17 ఎస్సీ వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో 15 ప్రీమెట్రిక్, రెండు పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. మొత్తం 2,023 మంది విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా..?

జిల్లాలోని వసతిగృహ విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం కళాశాల విద్యార్థులకు వారానికి ఆరు గుడ్లు, ఆరు పండ్లు, రెండు సార్లు చికెన్‌తో పాటు ఒక స్వీట్ ఇస్తున్నాం. పాఠశాల విద్యార్థులకు వారానికి ఐదు గుడ్లు, ఐదు పండ్లు, ఒకరోజు చికెన్ ఇస్తున్నాం. దీంతో పాటు ప్రతీరోజు సాయంత్రం స్నాక్స్ కూడా ఇస్తున్నాం.

ఉత్తమ ఫలితాల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ట్యూటర్ల ద్వారా ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నాం. పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ట్యూటర్ల ద్వారా గణితం, సైన్స్, ఆంగ్లం, హిందీ క్లాసులు చెప్పిస్తున్నాము.

విద్యార్థులు చలికి ఇబ్బంది పడుతున్నారా..?

కలెక్టర్ బీఎం సంతోష్ ఆధ్వర్యంలో ఇటీవలే జిల్లా కేంద్రంలోని కిటికీలు, తలుపులు లేని మూడు వసతిగృహాలకు మరమ్మతులు చేయించాం. జిల్లాలోని వసతిగృహాల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయా..?

జిల్లాలోని అన్ని కళాశాలలో చదివే ఎస్సీ విద్యార్థులకు 2023-24కు సంబంధించి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు కళాశాలకు అకౌంట్‌లో జమ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో మొత్తం 1,713 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 1,500 మందికి మంజూరు చేశారు. ఇంకా 200 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2024-25 విద్యాసంవత్సరంలో స్కాలర్‌షిప్ నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి జమచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటిన ఎస్పీ

నిబద్ధతతో విధులు నిర్వహించాలి

● ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిబద్ధతతో విధులు నిర్వహించాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్‌లు ఎస్పీకి గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. దొంగతనాల నివారణలో సీసీ కెమెరాలు ప్రాధాన్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. తమకు కేటాయించిన విధులను నిబద్ధతతో నిర్వహించినప్పుడే అధికారుల మన్ననలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్, ఏఎస్ఐ రోషన్న సిబ్బంది ఉన్నారు.

ప్రేమించి పెళ్లాడినా..

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- పోలీసుల అదుపులో మృతురాలి భర్త



పవిత్ర (ఫైల్)

6

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

7

ఏడు నెలల్లో.. రెండు విజయాలు

న్యాక్ ఏ గ్రేడ్, అటానమస్ సాధించిన జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల



జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

6

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాల్సిన విధానంపై వివరించారు. సర్వే సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీలోపు తెలియజేయాలని కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీలను కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేష్, జడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్, డీపీవో రామ్మోహన్ రావు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

బేరాలు ఘరూ

ఉపాధ్యాయుల పరస్పర ట్రాన్స్‌ఫర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- కోరుకున్న చోటుకు వెళ్లేందుకు రూ.20 లక్షలు ఇచ్చేందుకూ వెనుకాడని టీచర్లు
- హైదరాబాద్ పరిసరాల్లో హెచ్‌ఆర్‌ఏ ఎక్కువగా వచ్చే ప్రాంతాలపై దృష్టి
- బదిలీపై వెళ్లేందుకు 50 మంది రెడీ
- ఏడాదిలోపు సర్వీస్ ఉన్న వారు హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చేందుకు మొగ్గు
- వాటాప్స్ గ్రూపుల ద్వారా డీల్
- మధ్యవర్తిత్వం నెరపుతున్న సంఘాల నాయకులు
- చేతులు మారనున్న రూ.కోట్లు



మహబూబ్‌నగర్‌లోని విద్యాశాఖ కార్యాలయం

మచ్చుకు కొన్ని..

● హైదరాబాద్ సమీపంలోని ఓ పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ఉద్యాయుడు ఒకరు జనవరిలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. అతను పరస్పర బదిలీల కోసం ముందుకు వచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయుడితో రూ.23 లక్షలకు ఒప్పదం చేసుకున్నట్లు సమాచారం.

● మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గతంలో నిర్వహించిన డీఎస్సీలో ఒకరికి హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా హైదరాబాద్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఉద్యోగం వచ్చింది. ఆమె భర్త మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేస్తున్నారు. సదరు హిందీ టీచర్ మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో పని చేసేందుకు ఇష్టపడుతోంది. దీంతో ఆ టీచర్‌కు రూ.25 లక్షలు ఇస్తామని, పరస్పర బదిలీ అవకాశం కల్పించాలని కొందరు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తెచ్చిన 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు ఎన్నికల హామీలో భాగంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో పరస్పర బదిలీలకు ఎదురు చూస్తున్న ఉపాధ్యాయుల మధ్య బదిలీల బేరాలు మొదలయ్యాయి. జీవో 317లో స్థానికత ఆధారంగా కాకుండా సీనియారిటీని పరిగణలోకి తీసుకొని, జిల్లాలు కేటాయించారు. ఆ కారణంగా అప్పట్లో సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగినా, జూనియర్స్‌కు మాత్రం కోరుకున్న జిల్లాలు రాలేదు. మారుమూల ప్రాంత జిల్లాలకు కూడా వెళ్లాల్సి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల తెచ్చిన జీవోల ప్రకారం 243 స్పౌజ్, 244 మెడికల్, 245 పరస్పర బదిలీలు చేసుకునేందుకు దరఖాస్తులకు ఈ నెల 31 వరకు అవకాశం కల్పించింది. దాంతో పరస్పర బదిలీలకు డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉపాధ్యాయులు చాలా మంది తమ అవసరాలను బట్టి హైదరాబాద్,

(మిగతా 6లో..)

సమ్మె బాటలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

● దశాబ్ద కాలానికి పైగా పట్టింపు కరువు
● ఉద్యోగ భద్రత, సౌకర్యాలపై ఆందోళన
● జిల్లా వ్యాప్తంగా 518 మంది ఉద్యోగులు

వనపర్తి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి విధుల నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు నిరవధిక సమ్మెబాట పట్టారు. బీఆర్ఎస్ హయాం నుంచి తమ డిమాండ్లు పరిష్కరించాలని పోరాటం చేస్తూవస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే సమగ్రశిక్ష ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత స్పందించకపోవడంతో నవంబరు 15న సమ్మె నోటీసు ఇచ్చారు. అయినా స్పందించకపోవడంతో పోరుబాట పట్టారు. సమగ్ర శిక్షలో 12 విభాగాల్లో 518 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6,7,9వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా రిలే నిరాహార దీక్ష చేపటారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో పాఠశాలలతో పాటు గురుకులాలు, కేజీబీవీల విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. విద్యాశాఖలో సమగ్రశిక్ష ఉద్యోగులు వివిధ స్థాయిల్లో ఉన్నారు. వీరంతా సమ్మెలో ఉండటంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.



కలెక్టరేట్ ఎదురుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రధాన డిమాండ్లు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. ప్రమాద బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు కల్పించాలి. ఉద్యోగ విరమణ అయితే కనీసం రూ.20 లక్షలు బెనిఫిట్స్ సదుపాయం కల్పించాలి. తమ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులతో పాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ, విద్యాశాఖలో వెయిటేజ్ కల్పించాలి.

బేరాలు షురూ

(మొదటిపేజీ తరువాయి)

రంగారెడ్డి, మల్కాజ్‌గిరి జిల్లాలకు వెళ్లేందుకు మక్కువ చూపుతున్నారు. ఆయా జిల్లాల్లో పని చేసే ఉపాధ్యాయులు ఉంటే సంప్రదిస్తున్నారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు వచ్చేందుకు ఇష్టపడే వారుంటే బేరాలు కుదుర్చుకుంటున్నారు.

బేరాలు సాగేది ఇలా ..

పరస్పర బదిలీల కోసం బేరాలు జోరందుకున్నాయి. అందుకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు వస్తున్నాయి. తాను హైదాబాద్‌లోని పలానా ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నానని, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి రావాలని అనుకుంటున్నానని, ఇక్కడి నుంచి అక్కడికి వాచ్చేవారుంటే సంప్రదించాలని ఫోన్ నంబర్లు ఇస్తున్నారు. పాఠశాల వివరాలు పెడుతున్నారు. మధ్యవర్తులు కూడా పలానా టీచర్ రంగారెడ్డి జిల్లాలోని హైదరాబాద్ పట్టణంలో ఉండే ఓ పాఠశాలలో పని చేస్తున్నారని, అతను పరస్పర బదిలీల్లో నాగర్‌కర్నూల్‌కు రావాలని అనుకుంటున్నారని, మీరు ఓకే అంటే మాట్లాడతానని చెబుతున్నారు. కానీ ఖర్చు బాగా అవుతుందని, హైదరాబాద్‌లో పని చేస్తే మంచి హెచ్‌ఆర్‌ఏ ఉంటుందని, మీ పిల్లలకు దగ్గరగా ఉండొచ్చని అంటున్నారు. 2022లో చేపట్టిన పరస్పర బదిలీల్లో రూ.కోట్లు ఉపాధ్యాయుల చేతులు మారిన విషయం తెలిసిందే. అప్పటి బదిలీల కంటే ప్రస్తుతం జరుగుతున్న పరస్పర బదిలీలకు డిమాండ్ పెరిగింది. గతంలో జరిగిన పరస్పర బదిలీల్లో హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులు నారాయణపేట జిల్లాలోని కుదురుమల్ల పాఠశాలకు రూ.15 లక్షలు తీసుకొని వచ్చారు. అప్పట్లో ఇలాంటి బేరాలు వందల్లో జరిగాయి.

ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్నవారే ఆసక్తి

ఉద్యోగ విరమణకు నెల నుంచి ఏడాది సమయం ఉండి, హైదారాబాద్ చుట్టు పక్కల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు పరస్పర బదిలీలకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా కేంద్రాల్లో పని చేసే వారికి తమ స్థానాలు ఇస్తే.. రూ.లక్షల్లో డబ్బులు వస్తాయని ఆశిస్తున్నారు. అందులో భాగంగా వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చిన మెసేజ్‌ల ఆధారంగా బదిలీ కోరుకునే ఉపాధ్యాయులతో బేరాలు కుదుర్చుకుంటున్నారు. అనంతరం బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ఇప్పటికే 50 మందికిపైగా హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. హైదరాబాద్ చుట్టు పక్కల ఉండి, అధికంగా హెచ్‌ఆర్‌ఏ వచ్చే పాఠశాలలను ఎంచుకుంటున్నారు. అక్కడ పని చేసే వారు ఇక్కడికి వస్తామంటే రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బేరాలు కుదుర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చాలా వరకు బేరాలు చివరి దశకు వచ్చాయని విశ్వసనీయ సమాచారం.

● శంషాబాద్ సమీపంలో ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఒకరు ఏడాదిలో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన సొంత జిల్లా నాగర్‌కర్నూల్‌కు రావాలని అనుకుంటున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం ఇచ్చారు. అతనికి రూ.18 లక్షలు ఇచ్చి, బదిలీపై వెళ్లేందుకు ఒకరు సిద్ధంగా ఉన్నారని సమాచారం.

సీఎంను కలిసిన శివాంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డిని కలిసిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాంత్‌రెడ్డి

మక్తల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘురాం శివాంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా శివాంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పేరు ప్రతిష్ఠలతో పాటు యువతకు ఉపాధి కల్పించే విధంగా పనిచేస్తానన్నారు. ప్రజా సంక్షేమం, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు వివరిస్తానన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెబాట

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 10 : ఇరవై ఏళ్లుగా సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి సమ్మెబాట పట్టారు. అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ రాకపోడంతో జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వ అధికారం చేపట్టిన వంద రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ప్రభుత్వం ఏర్పడి సంత్సరం గడిచినా తమను పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు పలుమార్లు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర కమిటీ జేఏసీ పిలుపు మేరకు సమ్మె చేపట్టినట్లు తెలిపారు జిల్లాలో మొత్తం 600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెలోకి దిగినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోషాధికారి ఎండీ విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజామైనోద్దీన్, ఎస్‌వోలు శంకరమ్మ, మాధవి, ఐఆర్పీలు శ్రీనివాసులు, మొగులయ్య, హర్ష, వేణు, గీతారాణి, స్వరూపరాణి, తిరుపతి, సత్యం, జ్యోతి పాల్గొన్నారు.

ఏడు నెలల్లో రెండు విజయాలు

న్యాక్ ఏ గ్రేడ్, అటానమస్ సాధించిన జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఉమ్మడి జిల్లాలోనే అరుదైన రికార్డు పొందిన ఏకైక కాలేజ్

పరీక్షలను సొంతంగా నిర్వహించుకునే అధికారం..

యూనివర్సిటీకి చెల్లించే లక్షలాది రూపాయలు కళాశాల అభివృద్ధికి వినియోగించుకునే వీలు



జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

జడ్చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏడు నెలల వ్యవధిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విజయాలు సాధించిన జడ్చర్ల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరుదైన రికార్డును సాధించింది. మార్చి 21న న్యాక్ ఏ గ్రేడ్ సాధించగా, గత సెప్టెంబరు నాల్గో తేదీన అటానమస్(స్వయంప్రతిపత్తి) సాధించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే న్యాక్ ఏ గ్రేడ్, అటానమస్ సాధించిన ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా రికార్డుల్లోకి ఎక్కింది. జడ్చర్ల పట్టణంలోని ఓ గోదాములో 1963, అక్టోబరు 31న అప్పటి ఎమ్మెల్యే కొత్తకేశవుల కృషితో బూర్గుల రామకృష్ణరావు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం 61 వసంతాలను పూర్తి చేసుకుంది. డిగ్రీ కళాశాల నుంచి పీజీ కళాశాలకు అప్‌గ్రేడ్ అయ్యింది. ప్రస్తుతానికి ఎంఎస్‌సీ వృక్ష శాస్త్రం తరగతులకు అనుమతి పొందిన ఉమ్మడి జిల్లాలోనే మొదటి కళాశాలగా గుర్తింపు పొందింది. ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన పలువురు విద్యార్థులు ఇప్పుడు వివిధ శాఖల్లో రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులుగా, రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన పదవుల్లో, ప్రజాప్రతినిధులుగా ఉన్నారు. ఇంకొందరు ఇతర దేశాలలో ఉన్నత స్థానంలో ఉండగా, మరికొందరు వ్యాపారవేత్తలుగా ఉన్నతంగా ఎదిగిన వారు ఉన్నారు.

అరుదైన విజయాలు

ఒక విద్యా సంవత్సరంలో కేవలం ఏడు నెలల వ్యవధిలోనే రెండు అరుదైన విజయాలను జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధించింది. యూజీసీ కేటాయించే గ్రేడ్‌లలో 3.24 స్కోర్‌తో 'ఏ' గ్రేడ్ సాధించి, ఉమ్మడి జిల్లాలో ఏకైక కళాశాలగా, రాష్ట్రంలో ఎనిమిదో కళాశాలగా విజయం సొంతం చేసుకుంది. 2023 మార్చి 15, 16 తేదీలలో న్యాక్ బృందం పర్యటించింది. యూజీసీకి అందించిన నివేదికలతో 2.82 స్కోర్‌తో బీ++ గ్రేడ్‌ను సాధించింది. కాగా 'ఏ' గ్రేడ్ సాధించే అర్హత కళాశాలకు ఉందని, మళ్లీ ఒక పర్యాయం న్యాక్ బృందం పర్యటించాలన్న కళాశాల ఆలూమ్ని విజ్ఞప్తి మేరకు 2024 ఫిబ్రవరి 21, 22వ తేదీలలో బృందం మరోసారి పర్యటించింది. రెండు రోజుల పాటు కళాశాలలో పర్యటిం, యూజీసీ తన నివేదికలో 3.24 స్కోర్‌ను కల్పించింది. దీంతో కళాశాలకు 'ఏ' గ్రేడ్ కేటాయించారు. కళాశాల 2005లో బీ+ గ్రేడ్ సాధించింది. 2011లో బీ, 2017లో బీ++, 2023లో బీ++ గ్రేడ్‌లు పొందింది. గ్రేడ్‌ల కేటాయింపునకు న్యాక్ బృందం ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒక పర్యాయం పర్యటించనుంది. కళాశాలకు 'ఏ' గ్రేడ్ సాధించడంతో స్వయం ప్రతిపత్తి కల్పించే అవకాశాలు వస్తాయి. ఇతర కళాశాలలతో పాటు విశ్వవిద్యాలయాలతో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంటుంది. న్యాక్ 'ఏ' గ్రేడ్ ఉన్న కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉండనున్నాయి.

స్వయం ప్రతిపత్తి సాధించిన కళాశాల..

న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించిన డిగ్రీ కళాశాల అటానమస్(స్వయం ప్రతిపత్తి) హోదా దక్కించుకుంది. అందుకు సంబంధించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిప్యూటీ సెక్రటరీ గోపిచంద్ మెరుగు గత సెప్టెంబరు 4న ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి 2033-34 వరకు పదేళ్ల పాటు స్వయం ప్రతిపత్తి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తి సాధించిన కళాశాలకు కొన్ని ప్రత్యేక సడలింపులు కల్పిస్తారు. విద్యా ప్రమాణాలు పెంచుకునేందుకు కళాశాలకు పూర్తి అధికారం ఇస్తారు. కొత్త కోర్సులను ప్రవేశపెట్టి, కొత్త సబ్జెక్ట్‌లను తీసుకునే అవకాశం ఇస్తుంది. విద్యార్థులు కోరుకున్న సబ్జెక్ట్‌ల కోర్సులను కళాశాలలో ప్రారంభించే అవకాశం ఉంటుంది. కాలానుగుణంగా సిలబస్‌ను మార్చుకునే అవకాశం ఉండడంతో విద్యార్థులకు మెరుగైన విద్యాప్రమాణాలు కల్పించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పరీక్షలను స్వంతంగా నిర్వహించుకునే అధికారం కలిగి ఉంటుంది. ఫీజులను సైతం నియంత్రించుకునే అవకాశం ఉండటంతో విద్యార్థులకు అందుబాటులో ఉండే ఫీజులను నిర్ణయించుకునే వెసులుబాటు ఉంటుంది. యూనివర్సిటీకి చెల్లించే లక్షలాది రూపాయలను కళాశాల అభివృద్ధికే వినియోగించుకునే వీలుంటుంది. అలాగే జనరల్ బాడీ, అకాడమిక్ కౌన్సిల్, బోర్డ్ ఆఫ్ స్టడీ, ఫైనాన్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవచ్చు. అకాడమిక్ కౌన్సిల్ ముందస్తు అనుమతులతో డిగ్రీ, పీజీలలో కొత్త కోర్సులను ప్రారంభించుకోవచ్చు. న్యాక్ 'ఏ' గ్రేడ్, అటానమస్ కలిగి ఉన్న కళాశాలలకు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉండటంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది.



కళాశాల ముఖద్వారం

ఘనంగా మోహిషా ఖాద్రీ గంధోత్సవం

కోయిలకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహ్మద్ షేక్‌దావుద్ మోహిషా ఖాద్రీ గంధోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్‌దావుద్ ఇంటిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధోత్సవాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. అక్కడ ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దర్గాను చాదర్, సుగంధ ద్రవ్యాలు, గులాబీ పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహకులు అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ కృష్ణయ్య, నాయకుడు నారాయణగౌడ్, మహ్మద్ అమీర్, మహ్మద్ జాఫర్, మహ్మద్ రఫూఫ్, అబ్దుల్ రహీర్, ఇర్ఫాన్, సమ్మద్, సోహెల్, జుబేర్ పాల్గొన్నారు.



గంధోత్సవాన్ని ఊరేగిస్తున్న మత పెద్దలు

నామమాత్రంగా సామాజిక తనిఖీ

దేవరకద్ర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు అధ్యక్షతన 2023-24కు సంబంధించి ఉపాధి హమీ సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో నర్సిములు, అడిషనల్ డీఆర్డీవో ముషాదాబేగం హాజరై మాట్లాడారు. మండలంలోని 31 గ్రామాల్లో రూ.4.58 కోట్ల ఉపాధి పనులు నిర్వహించగా, ఇందులో రూ.3.74 కోట్లు కూలీలకు ఖర్చు చేయగా, మిగిలిన రూ.1.60 కోట్లు సీసీ రోడ్ల నిర్మాణానికి ఖర్చు చేసినట్లు వెల్లడించారు. చాలా గ్రామాల్లో బినామీ పేర్ల మీద కూలీ డబ్బులు చెల్లించారని, క్రీడా ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన పరికరాలు నిబంధనల ప్రకారం లేకపోవడంతో నగదును రికవరీ చేయనున్నట్లు తెలిపారు. ఏపీడీ శ్రీపాల్, డీఈవో ప్రేమలత, అంబుడ్స్‌కర్సన్ సంతోష్ కుమార్, ఏపీవో వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షలు ఈ నెల 15, 16వ తేదీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ బీఎం సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు రెండు రోజుల పాటు నాలుగు దఫాలుగా నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5:30 వరకు రెండు సెషన్‌లలో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామ ని, 9,610 మంది అభ్యర్థులు హాజరు అవుతున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంచాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్ స్టేషన్ పరిధి ఆగాపల్లి సాగర్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మంచాల సీఐ మధు తెలిపిన కథనం మేరకు ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా సరికొండకు చెందిన కొమ్ము ప్రశాంత్(24) సోమవారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా ఆగాపల్లి బస్టాండు వద్ద టిప్పర్‌ను దాటి ముందుకు వెళ్లే క్రమంలో ఎదురుగా ఉన్న ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రశాంత్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచాడు. ప్రశాంత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధు తెలిపారు.

సర్దుబాటు ఎలా..?

- ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణకు సిబ్బంది నియామకంపై సర్కార్ మల్లగుల్లాలు



నాగర్‌కర్నూల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పర్యవేక్షణ బాధ్యతలపై సందిగ్ధత నెలకొంది. నియోజకవర్గానికి కనీసం మూడు నుంచి నాలుగు వేల ఇళ్లు మంజూరు చేయాలని సంకల్పిస్తున్నది. ఈ నేపథ్యంలో వాటి నిర్వాహణ బాధ్యతను పర్యవేక్షించే అంశంలో రాష్ట్ర సర్కార్ మల్లాగుల్లాలు పడుతోంది. ఈ పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలంటే క్షేత్ర స్థాయిలో పకడ్బందీ వ్యవస్థ ఉండాలని సంకల్పిస్తున్న ప్రభుత్వం ఇతమిద్ధంగా ఇప్పటి వరకు ప్రాథమిక నిర్ణయాలు తీసుకోకపోవడం గమనార్హం.

అవుట్ సోర్సింగ్ సిబ్బందితో ఇక్కట్లు..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పట్లో రాష్ట్రంలో ప్రత్యేకంగా గృహ నిర్మాణ శాఖ ఉండేది. అందుకు జిల్లా కేంద్రంలో ఎస్‌ఈ, డీఈ, ఏఈలతో పాటు ప్రత్యేక విభాగాన్ని కేటాయించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సంఖ్య అధికంగా ఉండడంతో ఐటీఐలలో డాక్యుమెంట్ విల్ చేసిన వాళ్లను అవుట్ సోర్సింగ్ విధానంలో ఏఈలుగా నియమించారు. ఈ క్రమంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో కొంత మంది కాంగ్రెస్ నాయకులు పదుల సంఖ్యలో తమ బంధువులను లబ్ధిదారులుగా చేర్చి చెక్కులు డ్రా చేశారనే ఆరోపణలు వచ్చాయి. అనేక క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. ఇప్పటికీ అవి విచారణ దశలో ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల భాగోతంలో అధికారులతో సహా అవుట్ సోర్సింగ్ సిబ్బందిపైన అనేక ఆరోపణలు ఉండడం గమనార్హం.

ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఉమ్మడి జిల్లాలో అనేక ఆకాంక్షలు ఉన్నాయి. గడిచిన పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఆ పార్టీ నాయకులు ఊదరగొట్టారు. రెండు దఫాలు గెలిచినప్పటికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు ఆశలు కల్పించడంతో పేద జనం అనేక ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 14 లక్షల మంది ఉంటారని అంచనా ఉండగా దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 4లక్షల 50వేల వరకు ఉంది. ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాలకు సంబంధించి ఇతమిద్ధమైన అంశాలు తెరపైకి రాకపోవడంతో చాలా వరకు దరఖాస్తు చేసుకోలేదు. పదేళ్ల పాటు డబుల్ బెడ్రూంలు వస్తున్నాయంటూ ఊరించడం ఇప్పుడైనా వస్తాయో లేదో అనే క్రమంలో గ్రామసభలకు దూరంగా ఉన్నవారి సంఖ్య అధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 14వేల డబుల్ బెడ్రూంల ఇళ్ల నిర్మాణం జరిగినప్పటికీ ఏ ఒక్క అర్హుడికి అందజేయలేదు. మహబూబ్‌నగర్‌లో జరిగిన ఇళ్ల పంపిణీ రసాభాసాగా మారి కేసుల దాకా వెళ్లింది. ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా దుమారాన్ని రేకెత్తించిన విషయం తెలిసిందే.

కుటుంబాల విభజన ఎలా?

2005-09 సందర్భంలో ఉమ్మడి కుటుంబాలను పరిగణనలోకి తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారు. దాదాపు 13ఏళ్లు గడిచిన తర్వాత ఉమ్మడి కుటుంబాలన్నీ కూడా ఏక కుటుంబాలు గా మారాయి. వారందరికీ ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తారా లేదా అనే అంశంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఒత్తిడి నెలకొంది. ఇటీవల కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య రాజకీయ వైరం ముదరడంతో తమకు ఇందిరమ్మ ఇళ్లు దక్కకుండా కొర్రీలు పెడుతారే మోననే అనుమానం సామాన్య ప్రజల్లో నెలకొంది.

ప్రేమించి పెళ్లాడినా..

గద్వాల క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):రెండు సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లాడాడు... కొద్ది రోజులకే మళ్లీ విడిచిపెట్టాడు... తీరా నీవంటే నాకు ఇష్టం అని, నీవు లేకుంటే నేను బతకలేనని నమ్మబలికి మళ్లీ ఆదే వివాహితతో జీవనం సాగిస్తున్న క్రమంలో మంగళవారం ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భీంనగర్‌లో చోటు చేసుకున్నది.

ఈ ఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన బోయ పవిత్ర (22)కు అదే గ్రామానికి చెందిన కమ్మరి వినయ్ అనే యువకుడితో 2022లో రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రేమ వివాహం జరిగింది. వారి కాపురం కొద్ది రోజులు మాత్రమే సాఫీగా జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పవిత్ర ఇక వినయ్‌తో ఉండలేనని వచ్చేసి తండ్రి సంరక్షణలో హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. మళ్లీ కొద్దిరోజులకే పవిత్రను నమ్మించి తాను మారిపోయానని చెప్పి కొన్ని రోజులకు ఒకసారి కలుద్దాం అని చెప్పి గద్వాలలో మొదట పిల్లిగుండ్ల కాలనీలో, తర్వాత మళ్లీ కొద్దిరోజులకు భీంనగర్ కాలనీలో భర్త నివాసం ఉండేవాడు. పవిత్ర బి.టెక్ చదువుతూ అప్పుడప్పుడు వినయ్ దగ్గరకు వస్తుండేదని స్థానికులు తెలిపారు. రెండు రోజుల క్రితం గద్వాలకు వచ్చిన పవిత్ర మంగళవారం ఇంట్లోని ఓ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆత్మహత్య చేసుకునేముందు వారిద్దరి మధ్య గొడవ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ ఉరివేసుకున్న పవిత్రను మధ్యాహ్నం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో మార్చురీకి తరలించారు.

అనుమానం ఉండటంతోనే ఆత్మహత్య..?

వివాహమైన కొద్దిరోజులకే పవిత్రపై వినయ్ అనుమానం పెంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఆమె హైదరాబాద్‌లో చదువుతుండటం, తాను ఒక గాజు దుకాణంలో పనిచేయడం ఏ మాత్రం ఇష్టంలేదు. అంతేకాకుండా ఆమె ఫోన్‌లను తరుచూ పరిశీలించేవాడని, ఎవరు ఫోన్ చేసినా ఆరాతీసేవాడని తెలుస్తోంది. మంగళవారం కూడా వారి రూములో కల్లు ఉన్నదని, ఆ మత్తులోనే ఆమెపై ఇంకా అనుమానాలు వ్యక్తం కావడంతో క్షణికావేశంతో పవిత్ర ఆత్మహత్య చేసుకున్నదా, పవిత్రను హత మార్చి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం వినయ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

ముమ్మాటికీ హత్యే : కుటుంబ సభ్యులు

పవిత్ర మృతి ముమ్మాటికి హత్యేనని, మృతురాలి కటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్రను వివాహం చేసుకున్న కొన్ని రోజులకే వినయ్‌కు ఆమెపై అనుమానం ఉండేదని, ఆ క్రమంలోనే పవిత్రను హత్యచేసి ఉంటాడని, పోలీసులు దీనిపై పూర్తిస్థాయిలో విచారించేదాకా శవాన్ని తీసుకుపోయేది లేదని తేల్చిచెప్పారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ ఇసుక లారీని పట్టుకున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే పోలీసులు మంగళవారం బ్లూకోట్ విధులు నిర్వహిస్తుండగా 44వ జాతీయ రహదారిపై ఉత్తర ఫుడ్స్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న టీఎస్ 15 యూసీ 2465 నెంబర్ లారీని తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్, యజమాని శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం

నేటి నుంచే మద్దిమడుగు బ్రహ్మోత్సవాలు

పదర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి సన్నిధిలో మార్గశిర శుద్ధ ఏకాదశి బుధవారం ఉదయం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, తిరుపతి నుంచి వచ్చిన రుత్వికులు శివార్చకం శివప్రసాద్‌శర్మ, రఘు శర్మలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రీ తెలిపారు. బుధవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచకం, యాగశాల ప్రవేశం, అంకురార్పన ధ్వజారోహణం, సాయంత్రం ఉష్ట వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 12న ఉదయం విఘ్నేశ్వర పూజతో ప్రారంభమై, వాస్తు హోమం, రుద్ర హోమం తదితర పూజల అనంతరం రాత్రికి అశ్వవాహన సేవా కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. 13న ఉదయం విఘ్నేశ్వర, గవ్యాంతర తదితర పూజల అనంతరం రాత్రికి పార్వతీపరమేశ్వర కల్యాణం, మంగళ హారతి, గజవాహన సేవా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 14న ఉదయం విఘ్నేశ్వర పూజలతో ప్రారంభమై రాత్రికి సీతారాముల కల్యాణం, గరుడవాహన సేవ అనంతరం 9:30 గంటలకు హనుమాన్ మహాపడి పూజ ఉంటుందని ఆయన తెలిపారు. 15న ఉదయం గవ్యాంతర పూజలు, మన్యుసూక్తములతో ఆంజనేయ స్వామి అష్టోత్తర శతకలశ స్నపన, 108 కలశములచే నిర్వహిస్తారు. అనంతరం హనుమాన్ గాయిత్రి హోమం, మహాపూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించ నున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయాలి

- బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.నిరంజన్



జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీజీఆర్‌టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టీజీఆర్‌టీసీ డిపోల్లో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. నిరంజన్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించి డిపో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. డిపో అధ్యక్షుడిగా టీ శ్రీనివాస్, కార్యదర్శిగా లక్ష్మయ్య, కోశాధికారిగా జగన్మోహన్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జె.శ్రీనివాస్, వీఎస్.నారాయణ, బీసీ ఉద్యోగులు నిర్మల, రేవతమ్మ, సుమలత, విజయ్‌కుమార్, ఏడీసీ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ

- అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం



బిజినేపల్లి ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏకశిలా పదునెట్టాంబడి మహా పడిపూజ మహోత్సవంలో అనందగిరి కొండపై అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. స్థానిక ఆనందగిరి కొండపై వెలిసిన ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఏకశిలా పదు నెట్టాంబడి మహా పడిపూజ, 108 కలశాలతో స్వామివారికి అభిషేకాలు అయ్యప్ప మాలధారణ స్వాములు వైభవంగా నిర్వహించారు. గురు స్వాములు భార్గవ్, తంత్రీ కిట్టు, కుమ్మరి శ్రీను, పులేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణాలతో ప్రత్యేక పూజలు సాగాయి. అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తికి అయ్యప్ప మాలధారణ స్వాములు 108 కలశాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఏకశిలా పదునెట్టాంబడి మహా పడిపూజ నిర్వహించారు. స్వామి ఆల యానికి చేరుకోవాలంటే 18 కొండలను దాటాలని, ఆ కొండలను ఈ 18 మెట్లు సూచిస్తాయని పేర్కొన్నారు. మహా పడి పూజలో అయ్యప్ప స్వాములు పులేందర్‌రెడ్డి, తుమ్మల సురేందర్, ఇండ్లశ్రీను, కుమ్మరి శ్రీను, కుమ్మరి నాగరాజు, జయప్రకాశ్, శేఖర్, తుమ్మల వెంకటయ్య, లగిశెట్టి చంటి, మోహన్‌రెడ్డి, నరసింహులయ్య, శ్రీశైలం, పూన్యా నాయక్, శ్రీనివాసాచారి, ఊర్కొండ రఘుబాబు, భాను ప్రకాశ్, గుబ్బ రవి, బాలరాజు, ప్రవీణ్, వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

క్రైం కార్నర్

కేఎల్ఐ కాల్వలో పడి వ్యక్తి మృతి

కల్వకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సమీపంలోని కేఎల్ఐ కాలువలో పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేఎల్ఐ కాల్వలో పడి ఉన్న ఒక గుర్తు తెలియని పురుషుడి (40) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని పరిశీలించారు. స్నానానికి వెళ్లి కాలు జారి కాలువలో పడి ఉండొచ్చని ఎస్ఐ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, ఎవరైనా గుర్తిస్తే పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

దామరగిద్ద, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ పి. రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని మల్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన జడల మధు గత నెల 13న మద్యం తాగి బండి నడుపుతూ మండల కేంద్రంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం కోస్గి కోర్టులో హాజరు పరచగా, రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని అప్పన్నపల్లి శివారులోని పంట పొలంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మోహన్‌రెడ్డి అనే రైతు పొలంలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై గాయాలతో పాటు నోటి నుంచి రక్తం కారి ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నాడా? హత్యకు గురయ్యాడా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంఘటనా స్థలంలో వివరాలను సేకరించిన పోలీసులు మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి వాము దహనం



దహనం అవుతున్న గడ్డివాము

అచ్చంపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొలంలో నిల్వ చేసిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కాలి బూడిదయ్యింది. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని చందాపూర్‌లో మంగళవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఎలిమినేటి శేఖర్ తన వ్యవసాయ పొలంలో పశువుల మేత కోరం నిల్వ చేసిన గడ్డివాముకు మంగళవారం తెల్లవారుజామున మూ డు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. భారీగా మంటలు చెలరేగడంతో పొలంలో నిద్రపోతున్న రైతు గమ నించి, అచ్చంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేసింది. అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలి బూడిదయ్యిందని బాధితుడు తెలిపారు. దాదాపు రూ. 90 వేలు నష్టం సంభవించిందని చెప్పారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

మూసాపేట (అడ్డాకుల), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని చిన్నమునగాల్‌చేడ్‌లో సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాలెం నరేశ్‌కు అదే గ్రామానికి చెందిన ఆరుణ్‌సాగర్, వన్నం పాండు ఫోన్ చేశారు. లింగమయ్య ఇంటి వద్దకు రమ్మని చెప్పారు. అతడు రాగానే తనను పేరు పెట్టి ఎందుకు పిలిచావంటూ పాండు అతడిపై దాడి చేయడంతో తలపై గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ధన్వాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం గోటూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లు చాకలి నరేష్, పి. సంజన్న, ఓం. ప్రకాష్‌రెడ్డి, రామ్‌గోపాల్‌లపై కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కోస్గి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. నారాయణపేట కోస్గీ మండలం, హకింపేట గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అలవేల సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడి, మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కోస్గి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యంకోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఏఎస్ఐ బాలయ్య తెలిపారు.

రైస్‌మిల్లుపై కేసు నమోదు

వనపర్తి క్రైమ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పానుగల్ మండల పరిధిలోని కల్వరాల గ్రామంలోని శిరిడీ సాయి ట్రేడర్స్ రైస్ మిల్లుపై కేసు నమోదైనట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ వైపీ రమేశ్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ ద్రోణాచార్య, డీఎస్పీ వెంకట్, డీటీ నందకిశోర్ ఆధ్వర్యంలో మంగళశారం మిల్లుపై దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 9,500 బస్తాల ధాన్యం బస్తాల లెక్క తేడా రావడంతో యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



తమ్ముడు నందు నామాజీ, సోదరుల కుమారులు మురళీమోహన్ నామాజీ, విజయకుమార్ నామాజీ, కుమార్తె నాగేశ్వరి, రాజీవ్‌కుమార్ నామాజీ, కుమారుడు ప్రవీణ్‌కుమార్ నామాజీ, యశ్వంత్ నామాజీలతో నాగూరావు నామాజీ

యువరానర్!

» న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న కుటుంబం » ప్రముఖ న్యాయవాదిగా నాగూరావు నామాజీ

» అదే వృత్తిలో కుమారుడు, కుమార్తె, తమ్ముడు » అదే బాటలో మరో సోదరుడి కుమారుడు

నారాయణపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీలో తనకంటూ ఓ స్థానం సంపాదించుకొని, చురుకైన పాత్ర పోషిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ కుటుంబం న్యాయవాద వృత్తికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆయన ప్రముఖ న్యాయవాదిగా కొనసాగుతుండగా, ఆయన కుమార్తె, కుమారుడు, తమ్ముడు, మరో సోదరుడి కుమారుడు కూడా అదే వృత్తిలో ఉన్నారు. ఆయన దగ్గరి బంధువుల పిల్లలు ముగ్గురు కూడా న్యాయవాదులుగానే పని చేస్తున్నారు.

విద్యార్థి నాయకుడిగా పలు ఉద్యమాల్లో పాల్గొన్న నాగూరావు నామాజీ 1975 ఎమర్జెన్సీ సమయంలో ఏడాది పాటు జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత జనతా పార్టీలో ఉన్న ఆయన, 1880లో బీజేపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం తంగిడిగి నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అ తర్వాత మరోసారి తంగిడిగి నుంచి మహబూబ్‌నగర్ వరకు ఎద్దుల బండ్ల యాత్ర చేపట్టి, కలెక్టరేట్‌ను ముట్టడించి ఉద్యమ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన 1982లో ఔరంగాబాద్ యూనివర్శిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఒకవైపు రాజకీయ నాయకుడిగా, మరో వైపు న్యాయవాదిగా రాణిస్తూ, పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులకు ఉచితంగా న్యాయ సలహాలు అందించడమే కాకుండా పలు క్లిష్టమైన కేసులను వాదించి విజయం సాధించారు.



కేసు విషయంలో చర్చించుకుంటున్న నాగూరావు నామాజీ, తమ్ముడు నందు, కుమారుడు ప్రవీణ్‌కుమార్, కుమార్తె నాగేశ్వరి

నాగూరావు సొంత తమ్ముడు నందూ నామాజీ 1999లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసుకొని న్యాయ వాద వృత్తిలో కొనసాగుతున్నారు. 2007 నుంచి 2009 వరకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పని చేశారు. 2014లో నారాయణపేట బీజేపీ తరపున మునిసిపల్ వైస్ చైర్మన్‌గా ఐదేళ్ల పాటు కొనసాగారు. అన్న నాగూరావు నామాజీతో కలిసి న్యాయవాదిగా పని చేస్తున్నారు. అలాగే బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

నాగూరావు నామాజీ కుమారుడు ప్రవీణ్ నామాజీ, కుమార్తె నాగేశ్వరి కూడా 2008లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి, తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని న్యాయవాద వృత్తిని ఎంచుకున్నారు. నాగేశ్వరి అసిస్టెంట్ లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యురాలిగా పని చేస్తున్నారు. ముఖ్యమైన కేసులున్నప్పుడు తండ్రితో చర్చించి అవసరమైన సలహాలు, వాదోపవాదాల్లో మెళకువలను నేర్చుకుంటూ, ప్రతిభను మెరుగు పరుచుకుంటున్నారు. నాగూరావు నామాజీ మరో సోదరుడు నారాయణ రావు కుమారుడు విజయకుమార్ నామాజీ 2003లో గుల్బర్గా యూనివర్సిటీలో ఏల్ఎల్‌బీ పూర్తి చేసి ప్రస్తుతం నోటరీగా పని చేస్తున్నారు.

వీరితో పాటు దగ్గరు బంధువులైన యశ్వంత్ నామాజీ 2001లో ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తి చేసి, పేట కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. మురళీ మోహన్ నామాజీ 1998లో ఉస్మానియాలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి, మహబూబ్‌నగర్, కొడంగల్, తాండూర్ పట్టణాల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. రాజీవ్‌కుమార్ నామాజీ ఎల్ఎల్‌బీ పూర్తి చేసి మహబూబ్‌నగర్‌లోనే న్యాయవాదిగా ఉన్నారు.

గోవిందా హరి గోవిందా!

గోకుల నందన గోవిందా

» వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

» తొలి రోజు ధ్వజారోహణ, ప్రత్యేక పూజలు

» గోవింద నామ స్మరణతో మారుమోగిన మల్దకల్ పట్టణం



కలశాలకు పూజ చేస్తున్న వేద పండితులు

మల్దకల్, డిశంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 11 గంటలకు ఆలయం ముందు భక్త జన సందోహం మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సంతానం లేని దంపతులకు ప్రసాదం

బ్రహ్మోత్సవాల్లో తొలి రోజు పూజల అనంతరం సంతానం లేని దంపతులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ప్రసాదం స్వీకరిస్తే వచ్చే ఏడాది నాటికి సంతానం కలుగుతుందని స్థానికుల విశ్వాసం. అందుకోసం వారందరూ ఉపవాస దీక్ష చేపట్టి, ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి నేతృత్వంలో రుత్వికులు మధుసూదనాచార్యులు రమేశాచార్యులు, ధీరేంద్రదాసులు, రవిఆచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన స్వామి

ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అధికారులు, వేద పండితులు స్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన సూర్య ప్రభావాహనంపై ఆశీనులను చేసి, పుర వీధుల మీదుగా దశమికట్ట వరకు ఊరేగించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

13న కల్యాణోత్సవం

లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 13న కల్యాణోత్సవం, 14న తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవాన్ని 15న రాత్రి 12 గంటలకు నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.



ప్రసాదం తీసుకునేందుకు పోటీ పడుతున్న మహిళలు

గీతా పారాయణంతో ప్రశాంతత

» టీటీడీ కార్యాలయ కార్య నిర్వాహక అధికారి ఉత్తరాపల్లి రామాచార్యులు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ముఖ్యఅతిథులు, నిర్వాహకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత పారాయణం వల్ల జీవితానికి ప్రశాంతత లభిస్తుందని టీటీడీ కార్యా నిర్వహక అధికారి ఉత్తరాపల్లి రామాచార్యులు అన్నారు. టీటీడీ, హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం గీతా కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 280 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఆరు, ఏడు తరగతుల విభాగంలో పీ గణేష్ ప్రథమ, ఏ చైతన్య ద్వితీయ, కే హర్షవర్ధన్ తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. ఎనిమిది, తొమ్మిది తరగతుల విభాగంలో కీర్తన ప్రథమ, పూజ ద్వితీయ, వి దీక్షిత తృతీయ బహుమతులను సాధించుకున్నారు. 18 సంవత్సరాల విభా గంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను చుక్కాయిపల్లి శ్రీదేవి, ఎం గీత, ఎం ప్రతిభ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రామాచార్యులు మాట్లాడుతూ ప్రపంచంలోని పలు దేశాల్లో గీతా పారాయణం చేస్తున్నారని తెలిపారు. గీత కంఠస్థంతో విద్యార్థులలో ధారణా శక్తితో పాటు, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ రాములు గౌడ్, శ్రీశైలం, హనుమంతరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో బాలరాజు, రజిని, నాగ శివలక్ష్మీ, ఉమారాణి, శ్రీరాములు, బి రాములు, ఎత్తపు కేశవులు, చంద్రకళారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తెలకపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. తెలకపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను మంగళవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. కిచెన్‌షెడ్, కూరగాయలు, బియ్యం, పప్పులు, ఇతర సామగ్రిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వంట విషయంలో పొరపాట్లు చేయొద్దని సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేసి, అక్కడే బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. చదువుకునే పద్ధతిపై పలు సూచనలు ఇచ్చారు. తాను కూడా తెలుగు మీడియం విద్యార్థినే అని చెప్పారు. కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చానని, పదవ తరగతిలో మంచి మార్కులు రావడం వల్ల మంచి కాలేజీలో సీట్ వచ్చిందని, తర్వాత వరంగల్‌లో ఎన్ఐటీ బీటెక్ పూర్తి చేశానని, తర్వాత సివిల్స్ రాశానని వివరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అయ్యమ్మకు నిత్యావసర సరకులు

» ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన యువకుడు



అయ్యమ్మకు నిత్యావసర సరకులు అందిస్తున్న మహబూబ్‌పాషా, దౌలు

అయిజ టౌన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి దినపత్రికలో "కొడుకే ఆమె ప్రాణం" శీర్షికన ప్రచురితమైన కథనానికి ఓ యువకుడు స్పందించాడు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం, మేడికొండ గ్రామానికి చెందిన చాంద్‌బాషా పదేళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాదుకు వలస వెళ్లారు. అక్కడే గ్లాస్ ఫిట్టింగ్ వ్యాపారం చేస్తూ స్థిరపడ్డారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని చదివిన ఆయన, మేడికొండలో ఉండే తన మిత్రులు మహబూబ్ బాషా, దౌలులకు ఫోన్ చేశారు. ఆమెకు అవసరమైన నిత్యావసర సరకులను అందించాలని సూచించారు. దీంతో మంగళవారం వారు అయ్యమ్మ ఇంటికి వెళ్లి నెల రోజులకు సరిపోయేలా కందిపప్పు, మంచినూనె, పిండి, ఉప్మా రవ్వ, చక్కెర తదితర సరుకులను అందించారు.

రూ. లక్ష 30వేల రికవరీకి ఆదేశం

» పెద్దకొత్తపల్లిలో సామాజిక తనిఖీ

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో రూ. 1,30,218 రికవరీకి ఆదేశించినట్లు డీఆర్‌డీఏ, అడిషనల్ పీడీ రాజేశ్వరి తెలిపారు. పెద్దకొత్తపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై నిర్వహించిన విచారణలో పలు అవకతవకలు బయట పడ్డాయి. నిధులు దుర్వినియోగమైనట్లు వెల్లడయ్యింది. దీంతో మొత్తం రూ. 1,30,218 రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రం, ఏపీవో మంజుల, వివిధ గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టోర్నీకి జిల్లా క్రీడాకారులు



క్రీడాకారులు వర్ష, పవిత్ర, మీనాక్షి, మణికుమార్, రియాజుద్దీన్, సమీ

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్‌బాల్ రాష్ట్ర జట్టులో ఆరు జిల్లా క్రీడాకారులకు చోటు దక్కింది. బాలుర జట్టుకు మణికుమార్, రియాజుద్దీన్, సమీ, బాలికల జట్టుకు వర్ష, పవిత్ర, మీనాక్షి ఎంపికైయ్యారు. పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా జిల్లాలో బుధవారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న 68వ జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 హ్యాండ్‌బాల్ టోర్నీలో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారిని ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రజనీకాంత్‌రెడ్డి, మహ్మద్ జియావుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్ హుస్సేన్, కోచ్ ప్రదీప్‌కుమార్ అభినందించారు. జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ప్రశాంత్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, చారగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని పెద్ద కార్పాముల గ్రామానికి చెందిన అరి గెల పెద్ద నరసింహ కుమారుడు అగిరెల శివ (22), అదే గ్రామానికి చెందిన ఎండీ మహమ్మద్‌తో కలిసి సోమవారం సాయం త్రం 6.30 గంటల సమ యంలో ద్విచక్ర వాహనంపై పెద్దకొత్తపల్లికి వచ్చారు. స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా, రాత్రి 8.30 గం టల సమయంలో మడోని కుంట చెరువు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. బైక్ వెనుక కూర్చున్న అరిగెల శివ రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో అతడిని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనపై అతడి తల్లి అరిగెల అలివేల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన కొమ్ము రామస్వామి, బాలమ్మ దంపతుల కుమారుడు కొమ్ము ప్రశాంత్ (23) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయలు దేరాడు. మార్గం మధ్యలో రంగారెడ్డి జిల్లా మంచాల మం డలం ఆగపల్లి వద్ద వీరు వెళ్తున్న బైక్‌ను ప్రైవెట్ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రశాంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రశాంత్ మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతడి దుర్మరణంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

ఇంటర్వ్యూ..

ధరణిలో పెండింగ్ భూ సమస్యలు పరిష్కరిస్తాం

- అమ్రాబాద్ తహసీల్దార్ శైలేంద్రకుమార్



అమ్రాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూమి కలిగిన రైతుల విరాసత్ ధరణి ఆన్‌లైన్ డిజిటల్ పెండింగ్‌లను పరిష్కరించాలని ఇటీవలే ప్రభుత్వం తహసీల్దార్లకు వెసులుబాటు కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో సమగ్రంగా మార్పులు చేయడానికి మరికొంత కాలం పట్టే అవకాశం ఉండడంతో భూ విరాసతులు, డిజిటల్ పెండిగులు, కులం లేదా పేరు మార్పిడి పట్టాదారు పాసుపుస్తకాలలో జరిగిన తప్పులను సవరించడానికి తమకు ప్రభుత్వం అధికారం ఇచ్చిందని అమ్రాబాద్ తహసీల్దార్ బీవీ శైలేంద్రకుమార్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు ఎన్ని పెండింగులో ఉన్నాయి.

మండలంలో 45 కల్యాణలక్ష్మి, రెండు షాదీ ముబారక్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎమ్మెల్యే సంతకం చేసిన తర్వాత ఆ దరఖాసస్తులను పై అధికారులకు పంపిస్తాం. చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరు కాగానే లబ్ధిదారులకు అందజేస్తాం.

కార్యాలయంలో సిబ్బంది సరిపడా ఉన్నారా, వసతులు ఉన్నాయా.

తమ కార్యాలయంలో మౌలిక సదుపాయాలు బాగానే ఉన్నాయి. టైపిస్టు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో తనిఖీలు చేస్తున్నారా?

ఒక్కో అధికారికి కొన్ని హాస్టళ్లు, గురుకులాలు అప్పగించగా, నేను ఎల్మపల్లి, మన్ననూర్, వటువర్లపల్లి గ్రామాల్లో ఉన్న గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేస్తున్న. పరిసరాల పరిశుభ్రత, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తు న్నారా తదితర విషయాలపై నివేదికను కలెక్టర్‌కు పంపాము.

న్యూస్ బాక్స్

ఆశా వర్కర్ల అరెస్టుకు ఖండన

తెలకపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా చలో కమిషనరేట్‌కు బయల్దేరుతున్న ఆశా వర్కర్లను అర్ధరాత్రి అరెస్టు చేయడం సిగ్గుచేటని సీపీఎం మండల కార్యదర్శి గోపాస్ లక్ష్మణ్, సీఐటీయూ మండల నాయకులు విజయ్‌గౌడ్‌లు ప్రభుత్వ తీరును ఖండించారు. మంగళవారం తెలకపల్లిలో విలేకర్లతో వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, లెప్రసీ సర్వే పల్స్ పోలియో పనులు చేయించుకుని సర్వే డబ్బులు ఇవ్వకపోవడమేంటన్నారు.

సేవాదళ్ మండల కమిటీ ఎన్నిక

ఉప్పునుంతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సేవాదళ్ మండల కమిటీ అధ్యక్షునిగా సంపీ ప్రహ్లాద్‌ను ఎన్నుకున్నారు. అచ్చంపేట సేవాదళ్ అసెంబ్లీ అధ్యక్షుడు జగదీశ్వర్‌తో కలిసి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతరెడ్డి, భాస్కర్, శ్రీశైలం, జనార్ధన్ ఉన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.ఆంజనేయులు, అధ్యక్షుడిగా ఎండీ గౌస్ పాషా, ప్రధాన కార్యదర్శిగా డి.మల్లయ్య, ఉపాధ్యక్షులుగా కె.సువర్ణ, ఎస్.రాజు, కోశాధికారిగా వి.లక్ష్మీపతి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా బి. పరమేశ్వర్‌లను ఎన్నుకున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పొట్లపల్లి మహేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, లక్ష్మణ్, టీఎస్ యూటీఎఫ్, కేజీబీవీ సబ్‌కమిటీ జిల్లా అధ్యక్షురాలునర్మద, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి : సీపీఎం

ఉప్పునుంతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా మహాసభల్లో భాగంగా ఈ నెల 14న అచ్చంపేట పట్టణంలో నిర్వహించే బహిరంగ మహాసభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్‌దేశ్యనాయక్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అంతకు ముందు మహాసభల గోడ ప్రతికను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శివకుమార్, రాములు, లక్ష్మయ్య, మన్మధ గౌడ్, వెంకటయ్య, రామస్వామి ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి : బీఆర్ఎస్

పెంట్లవెల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటలను, వంట గదిని, కూరగాయలు, సరుకులను పరిశీలించారు. సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు ఆకు కూరలు, పండ్లు, గుడ్లు ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు రాజేష్, సురేందర్‌గౌడ్, అబ్దుల్ హుస్సేన్, రెడ్డిరాము, సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించినా..

ఉపయోగం ఏదీ ?

- నిరుపయోగంగా జెన్‌కో గ్రౌండ్
- చేసిన పనికి బిల్లులు చెలించలేదని కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్
- బిల్లులు పూర్తిగా చెల్లించామంటున్న జెన్‌కో అధికారులు



ఈగలపెంటలో జెన్‌కో ప్లే గ్రౌండ్

దోమలపెంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పని చేసే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన మైదానం నిరుపయోగంగా ఉంది. ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు జెన్‌కో యాజమాన్యం ప్లే గ్రౌండ్, జిమ్, మొదలగు వసతులు కల్పించాల్సి ఉంటుంది. అందులో భాగంగానే వోఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) స్టోర్ దగ్గర ప్లే గ్రౌండ్ నిర్మాణం చేపట్టేందుకు 2019 సంవత్సరంలో రూ.9 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా, దోమలపెంటకు చెందిన కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి కాంట్రాక్ట్ తీసుకొని మైదానంలో ముళ్ల పొదల తొలగింపు, గోతులు పూడ్చి, భూమి చదును, మరమ్మతు వంటి పనులు చేయించారు. ఇంత వరకు బాగానే ఉన్నా, సమస్య ఇక్కడే మొదలైంది. ఉద్యోగులు మైదానంలోకి వెళ్తే మాత్రం సంబంధిత కాంట్రాక్టర్ రానివ్వడం లేదు. ఎందుకూ అంటే పనులు చేసినందుకు తనకూ ఇంకా రూ.23 లక్షల జెన్‌కో అధికారులు చెల్లించడం లేదని, బిల్లు పూర్తిగా చెల్లించే వరకూ గ్రౌండ్‌ను అప్పంగించేది లేదని ఆయన కోర్టులో కేసు వేశారు. దీంతో మైదానంలో పిచ్చి మొక్కలు పెరిగి, పాములు, కుందేళ్లకు ఆవాసంగా మారింది. తాము ఎప్పుడైనా గ్రౌంగ్‌లో ఆటలు ఆడేందుకు, వ్యాయామం చేసేందుకు వెళితే కాంట్రాక్టర్ నుంచి ఇబ్బందులు తప్పడంలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెన్‌కో యాజమాన్యం స్పందించి తక్షణమే సమస్య పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గ్రౌండ్ పనులు పూర్తి చేయాలి

జెన్‌కో గ్రౌండ్ పనులు పూర్తి చేయడం వల్ల దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగా గ్రామాల యువతకు, విద్యార్థులకు జెన్‌కో ఉద్యోగులకు గేమ్స్ పరంగా ఎంతో ఉపయోగపడుతుంది. జెన్‌కో అధికారులు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని కోరుతాం.

- బెజ్జం మల్లికార్జున్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

బిల్లులు ఇవ్వనందుకే కోర్టుకు వెళ్లా

ఈగలపెంటలో జెన్‌కో ప్లే గ్రౌండ్ పనులు చేసి నాలుగేళ్లుగా ఎదురు చూసినా నాకు చెల్లించల్సినా బిల్లులు రూ. 23 లక్షలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నం దునా కోర్టులో కేసు వేశాను. నాకు రావల్సినా పూర్తి బకాయిలు చెల్లించే వరకు ప్లే గ్రౌండ్‌నూ జెన్‌కో యాజమాన్యానికి అప్పగించేది లేదు.

- చిట్టి సుబ్బారెడ్డి, కాంట్రాక్టర్

త్వరలోనే వినియోగంలోకి తెస్తాం

ప్రస్తుతం ఉన్న ప్లే గ్రౌండ్‌లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి మరమ్మతులు చేపడతాం. ఉద్యోగులకు అన్ని వసతులు కల్పించి ఆటలు, వ్యాయామం చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. ఉద్యోగులకు మైదానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తా.

- రామసుబ్బారెడ్డి, జెన్‌కో సీఈ, ఈగలపెంట

అనుమతి లేని పనులకు బిల్లులు చెల్లించలేం

మైదానానికి సంబంధిచిన ఎలాంటి ఆధారాలూ లేకుండా తాను చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ తమపై ఒత్తిడి చేస్తున్నారు.గతంలోచేసిన పనులకు రూ.8.96 లక్షలు చెల్లించాం. అయినా కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లారు. త్వరలోనే సమస్య తీరనుంది.

- రవీంద్రకుమార్, జెన్‌కో వోఅండ్ఎం ఎస్ఈ, ఈగలపెంట

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి



నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యా శాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరవధిక సమ్మె నిర్వహించగా ఆయన వెళ్లి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ పథకంలో కనీస వేతన చట్టం అమలు కాక ఉద్యోగులు వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 వేల మంది ఉద్యోగులు ఏళ్ల తరబడి పని చేస్తున్నారని పేర్కొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానలో డాక్టర్‌ను నియమించాలి : సీపీఎం

కోడేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానలో డాక్టర్‌ను నియమించి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని తీగలపల్లి పల్లె దవాఖానను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పల్లె దవాఖానలు పేరుకు మాత్రమే ఉన్నాయని, డాక్టర్ లేక మూతపడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇక్కడ పని చేయాల్సిన డాక్టర్ కోడేరు పీహెచ్‌సీలో పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు శివశంకర్, వరప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

చిన్నారుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : సీడీపీవో



అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాశనంలో పాల్గొన్న సీడీపీవో భాగ్యమ్మ

కల్వకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు పౌష్టికాహారం, వారి పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కల్వకుర్తి సీడీపీవో భాగ్యమ్మ కోరారు. కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాశన కార్యక్రమం అంగన్‌వాడీ టీచర్ అలివేల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సీడీపీవో భాగ్యమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీ హాజరై చిన్నారులకు అన్నప్రాశన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల తల్లులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తల్లులు, చిన్నారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి



కల్వకుర్తిలో పండుగ సాయన్న చిత్ర పటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి/ పెద్దకొత్తపల్లి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : వీరుడు పండుగ సాయన్న 134వ వర్ధంతిని కల్వకుర్తి పట్టణంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిన్నా, చంద్రయ్య, చిమ్ముల శ్రీకాంత్, చందు, నాని, నాయకులు తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో తెనుగోళ్ల ముద్దు బిడ్డ పండుగ సాయన్న వర్ధంతిని మత్స్యసహకార సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పండుగ సాయన్న చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమను కీర్తించారు. మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గడ్డికోపుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గట్టు ఆంజనేయులు, తాలూకా ఉపాధ్యక్షుడు సొప్పరి మల్లయ్య, సహాయ కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ రాములు, సత్యనారాయణ ఉన్నారు.

సీఎం కప్ మండల విజేతగా సిర్సవాడ

తాడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకుగాను సీఎం కప్ ఆటల పోటీలు చేపడుతోంది. మంగళవారం మండల కేంద్రంలో మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధికి సంబంధించి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో వాలీబాల్ ప్రథమ విజేతగా సిర్సవాడ గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలవగా తాడూరు రెండవ విజేతగా నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మచారి, పీఈటీలు అనితానిర్మల, పవన్, శ్రీకాంత్, సీనియర్ క్రీడాకారులు, గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రార్థనా సమయానికి రాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

కోడేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల ప్రార్థన సమయానికి హాజరు కాని ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని తీగలపల్లి ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రార్థనకు హాజరుకాలేదు. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ప్రధానోపాధ్యాయుడు ప్రార్థనకు రాకపోవడంతో ఇతర సిబ్బంది, విద్యార్థులు కూడా హాజరు కాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. విద్యాబుద్ధులు నేర్పే గురువులే వేళలు పాటించకపోవడం విచారకరమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

లారీ యజమానులతో చర్చించిన ఎక్సైజ్ ఎస్పీ

తిమ్మాజిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేటలోని ఉమ్మడి పాలమూరు జిల్లాకు మద్యం సరఫరా చేసే మద్యం డిపోను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి మంగళవారం పరిశీలించారు. యజమానులు, డ్రైవర్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె డిపో అధికారులతో, స్థానిక ఎస్ఐ నరేందర్ రెడ్డితో సమావేశమై మద్యం కాటన్‌లు తరచుగా దొంగతనాలు జరుగుతుండడంతో రక్షణ కల్పించాలని కోరుతూ ఇటీవల పది రోజుల పాటు లారీ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. దొంగతనానికి గల కారణాలను, కావాల్సిన సదుపాయాలను యజమానులు, డ్రైవర్లతో కొద్దిసేపు చర్చించారు. లారీలను లోపలికి అనుమతించి రక్షణ కల్పించే విషయమై కమిషనర్, సంస్థ జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్తామని వారికి హామీ ఇచ్చారు. ప్రతీ రోజు కొన్ని వాహనాలను లోపలికి అనుమతించేందుకు ఎక్సైజ్ అధికారులు అంగీకరించారు. ఆమె వెంట ఎక్సైజ్ సీఐ కల్యాణ్, ఎక్సైజ్ ఎస్ఐ బాలీశ్వరి, డిపో అధికారులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేపై సమావేశం

తెలకపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటి సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన కుటుంబాల వారీగా జరిగిన సర్వేపై చర్చించి తెలకపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డులు స్వాధీనం

బల్మూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రికార్డుల తనిఖీల్లో భాగంగా డీఎల్‌పీవో వెంకటప్రసాద్, ఎంపీవో బసిరెడ్డిలు గ్రామపంచాయతీ రికార్డులను మంగళవారం పరిశీలించారు. గ్రామపంచాయతీకి 2013 నుంచి 2024 ఫిబ్రవరి వరకు రూ.3,55,18,543 మంజూరు కాగా వాటిలో కొంత డబ్బు దుర్వినియోగమైనట్లు గ్రామస్థులు కౌన్సిల్ ఫర్ సిటిజర్ రైట్స్ సంస్థ నుంచి ఆర్‌టీఐ యాక్ట్2(జే)(1) ప్రకారం బల్మూరు గ్రామపంచాయతీ రికార్డులను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రికార్డుల ఫిబ్రవరి 2024న తనిఖీలు చేసినట్లు వారు తెలిపారు. అనంతరం ఫైనల్ రిపోర్టు పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్, వివిధ శాఖలకు ఈ ఫైనల్ రిపోర్ట్ అందజేయడం జరిగిందన్నారు. మాజీ సర్పంచ్ శివశంకర్ ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన కార్యదర్శులు వజ్రలింగం, వెంకటేశ్, కళావతి, రాజు, చందర్‌లను పిలిపించుకుని వారి సమక్షంలోనే పూర్తిస్థాయి రికార్డులను సీజ్ చేసుకుని జిల్లా కేంద్రానికి తరలించనున్నట్లు తెలిపారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- విజయ డెయిరీ చైర్మన్ నర్సయ్య యాదవ్



మాట్లాడుతున్న విజయ డెయిరీ చైర్మన్ నర్సయ్య యాదవ్

అచ్చంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేసీ ఆర్ పరిపాలనలో తెలంగాణ విగ్రహం బీఆర్ఎస్ తల్లిలాగానే ఉండేదని విజయ డెయిరీ చైర్మన్ నర్సయ్య యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి వర్గం కలిసి తెలంగాణ తల్లి విగ్రహం ఎలా ఉండాలో తయారు చేశారన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ సొంత రాజకీయాల కోసం ముఖ్య మంత్రిని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రిపై మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కట్ట అనంతరెడ్డి, కాశన్న యాదవ్,మాజీ ఎంపీపీ రామనాథం, మహబూబ్‌అలీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



కొల్లాపూర్‌లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణ పనులను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మంగళవారం పరిశీలించారు. అయ్యప్ప స్వాములతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేష్, అయ్యప్ప స్వాములు రమేష్, రఘురాం, నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

కొల్లాపూర్ : కొల్లాపూర్‌లోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా కృష్ణమ నాయుడును అయ్యప్ప స్వాములు ఎన్నుకున్నారు. కృష్ణమ నాయుడు మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ. ఐదు లక్షల విరాళం



రూ.5లక్షల విరాళం అందజేస్తున్న సామాజిక కార్యకర్త రాజు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అత్యంత్యపురా తనమైన ఉట్లకోనేరు ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త సాదె రాజు రూ.5.లక్షల విరాళం మంగళవారం ఆలయ కమిటీ సభ్యుడు యాదయ్యకు అందజేశారు. గతంలో పలు ఆలయాలకు తనవంతు సహకారాలు అందిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు హర్షం వక్తం చేశారు.

పోచమ్మ ఆలయానికి విరాళం

కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణంలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ లక్షా 51వేల విరాళం ఇస్తానని ఇటీవల ప్రకటించారు. మొదటి విడతలో ఆయన సమకూర్చిన రూ.50వేల చెక్కును తలకొండపల్లి మాజీ సర్పంచ్ జ్యోతయ్య, సభ్యులు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ధారమోని గణేష్, హనుమ నాయక్, ఆలయ అధ్యక్షుడు నరసిం హ, నాయకులు సత్యం, శ్రీనివాసులు, రాజశేఖర్, బాలస్వామి, రాజు, కృష్ణయ్య, శ్రీను ఉన్నారు.

ప్రతీ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ రమ్య

- మునిసిపల్ చైర్ పర్సన్ రమ్య వెల్లడి

కొల్లాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామాలతో పాటు మునిసిపాలిటీ పరిధిలోఉన్న గ్రామాల్లో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. మంగళవారం కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న నర్సింగరావు పల్లి (బోయ లపల్లి) గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని కొల్లాపూర్ సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, కౌన్సిలర్ చిట్టెమ్మరవితో కలిసి రమ్య ప్రారంభించారు. రైతుల దగ్గర కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రసీదు చెల్లించాలని ఆమె మహిళా సంఘాల సభ్యులకు సూచిం చారు. వడ్ల తేమ శాతాన్ని ఆమె పరిశీలిం చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణ, రవిరెడ్డి, సత్యం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం సరికాదు



కొల్లాపూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అభిషేకం

కొల్లాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తితో రూపొం దించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లిగా మార్చారని పేర్కొంటూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెడిసెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కొల్లాపూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు అభిషేకం చేశారు. కోట్లాది మంది తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తిని నింపిన తల్లి రూపాన్ని మార్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాచినేనిపల్లి సింగిల్‌విండో చైర్మన్ చింతకుంట శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, కాటం జంబులయ్య, కట్టా శ్రీనివాసులు, నిరంజన్, సురేందర్ రావు, నరసింహ, సురేందర్ గౌడ్, రుక్మద్దీన్, కిరణ్ కుమార్, కలీమ్, శ్రీను, మహేష్ పాల్గొన్నారు.

విగ్రహం మార్చడం సమంజసమా?

కల్వకుర్తి : తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చడం ఎంత వరకు సమంజసమని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మార్చడాన్ని నిరసిస్తూ కల్వకుర్తిలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, వైస్ చైర్మన్ షాహేద్, కౌన్సిలర్లు సూర్యప్రకాశ్ రావు, భోజిరెడ్డి, సైదులుగౌడ్,నాయకులు మధు, తాహెర్ అలీ, శ్రీను, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య గౌడ్, రాములు, మధు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- అయ్యప్ప స్వాముల రాస్తారోకో
- ఘటనను ఖండించిన ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు

బిజినేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని ధ్వంసం చేసిన దుండగుడిని శిక్షించాలని కోరుతూ పలు హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అయ్యప్ప మాలధారణ స్వాములు ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఫ్లెక్సీని సోమవారం అర్ధరాత్రి ధ్వంసం చేసిన దుండగునిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అయ్యప్ప మాలధారణ స్వాములు, ఆంజనేయ మాలధారణ స్వాములు, హిందూ వాహిని, బజరంగ్‌దళ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేపట్టారు. పలువురు మాట్లాడుతూ గతంలో కూడా హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వికృత చేష్టలకు పాల్పడిన దుండగుడే, మరోసారి ఫ్లెక్సీలను ధ్వంసం చేశాడని, అతన్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఎనిమిదేళ్ల క్రితం చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా అతడే ధ్వంసం చేశాడని, ఇలాంటి చట్టవ్యతిరేకమైన ఘటనకు పాల్పడుతున్న వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీఐ కనకయ్య గౌడ్ మాట్లాడుతూ అసభ్యకరకంగా ప్రవర్తించి అయ్యప్ప స్వాముల మనోభావాలు కించపర్చేలా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. స్వాములను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఆయన వెంట బిజినేపల్లి ఎస్ఐ శ్రీనివాసులు, నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్, తిమ్మాజిపేట, తాడూరు ఎస్ఐలు, ఏఎస్ఐలు శ్రీనివాసులు, సయ్యద్ అలీ, సిబ్బంది ఉన్నారు.

ముస్లిం సంఘాల ఖండన

ఇతర మతాలకు చెందిన వ్యక్తులను కాని, వారు ఆరాధించే దేవుళ్లను ముద్రించిన ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన ఘటనను ముస్లిం మైనార్టీ సంఘాలు ఖండించాయి. అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.